గీత్‌మాలవారి ఆడియో క్యాసెట్ గెలుచుకున్న కథ

మినీకథ

# అదీ సంగతి

మండు వేసవి. మిట్టమధ్యాహ్నపు ఎండ అభిమాన సంఘాల దురభిమానంలా పేట్రేగిపోతోంది. ఫోన్ మోగింది. జ్వాలా సుందరం రిసీవరెత్తాడు. ''హలో! ఫైర్ సర్వీస్'' అనే లోపలే అటు నుంచి —

''అసలే కరంటు లేక ఏర్ కండిషనర్‌వున్నా చెమట్లు కక్కి ఛస్తున్నాం ఈ ఎండ ధాటికి. అది చాలనట్టు ...''

''హలో! ఇది పవర్ మెయిన్‌టెనెన్స్ ఆఫీసు కాదు మేడం! ఫైర్ సర్వీసు'' అన్నాడు జ్వాలాసుందరం. అట్నించి మాటాడే అమ్మాణి అదేం విన్పించుకోలేదు. తన ధోరణిలో —

''అది చాలనట్టు ఈ కొంపకి నాలుగు కొళాయి లేద్దేనా నీళ్ళు మాకే చాలిఛావడం లేదు. సంతాప సభల కెళ్ళిన మంత్రివర్యుల్లా బొట్టు బొట్టూ కన్నీళ్ళలా కారుస్తాయి తప్పితే, ఒక్క కొళాయి లోంచైనా వేలి మందాన ధార ...''

''హలో! దిసీజ్ నాట్ మునిసిపల్ ఆఫీసు ప్లీజ్! అగ్నిమాపక కేంద్రం తల్లీ! ఫైర్ సర్వీస్ స్టేషన్. నీళ్ళు మీ ఇంట్లోనే కాదు మా ఇంట్లోనూ అదే వరు ...'' అతని మాట పూర్తి కానేలేదు.

''మా పెంపుడు కుందేళ్ళు ఇండియావి కావండీ! రష్యన్ గ్రే జెయింట్ రాబిట్స్'. ఈ వేడి సెగలు భరించలేక ...''

''అయ్యో దేవుడా! ఇది కుందేళ్ళ, కుక్కపిల్లల



బ్రీడింగ్ ఫాం కాదు మేడం! రాబిట్స్ మాటేమిటి తల్లీ- రొబోట్స్‌కే వడదెబ్బ తగుల్తూ వుంటే! కొంపలంటు కుంటే చెయ్యాల్సిన ఫోన్ నెంబర్ తల్లీ ఇది. కుందేళ్ళూ, కుక్కపిల్లలు గురించి కాదు. మీక్కావలసిన ఫోన్ నెంబరేదో సరిగా ... ''

''హార్టి కల్చరల్ సెంటర్ నుంచి ప్రత్యేకంగా తెప్పించిన జపాన్ లిల్లీలు, జర్మన్ గులాబీ - కెనడా క్రైసాంథియంలూ ఈ వేడిమికి వుంటాయో, ఛస్తాయో తెలీక ...''

''ఈ మధ్యాహ్నపు ఎండలో వన్నెందుకిలా వాయిం చేస్తున్నావు తల్లీ! హార్టి కల్చరల్ సెంటర్ మాట దేవుడెరుగు. నాకు హార్ట్ ఎటాక్ వచ్చేలా వుంది నీకు నచ్చచెప్పేసరికి! అగ్నిమాపక కేంద్రం తల్లీ ఇది! కొంప లంటుకుంటే చెయ్యాల్సిన ఫోన్ నెంబరమ్మా! పెంపుడు మొక్కల కోసం, పెంపుడు కుక్కల కోసం చేసి మా దుంప తెంచకు తల్లీ! ఇళ్ళంటుకున్నాయా ఎక్కడయినా? ఆ సంగతి చెప్పి ఉద్ధరించు మమ్మల్ని. అసలెక్కడ నుంచి తల్లీ మాట్లాడుతున్నావు?

''అదే! అదే! ఆ సంగతికే వస్తున్నాను. నేను లయనెస్ సింహలక్ష్మిని మాట్లాడుతున్నాను. మా బంగళా పక్కనుండే అలగా జనం పాకలు అంటుకున్నాయి. ఈ ఎండకు తోడయిన ఆ మంటల వేడిమికీ, సెగలకీ మేమూ, మా రాబిట్స్, మా గార్డెన్ ఏంటవుతాయోనని భయంగా వుంది. వెంటనే వస్తారు కదూ?''

జావగారిపోయిన జ్వాలాసుందరం తేరుకునేందుకు టైం పట్టిందంటే పట్టదూ మరి!

—రామతీర్థ


